# కలికాలం

-ఇచ్ఛాపురపు రామచంద్రం

మంచం మీద దుప్పటి మార్చి... కూజాలో నీళ్లు నింపి తెచ్చి - అడిగాడు శంకరం. 'సర్! కాఫీ... టీ... ఏమయినా తెమ్మంటారా?'

'వొద్దు. రైలు దిగుతూనే కాఫీ తాగేను. నిన్న మధ్యాహ్నమనగా ఎక్కిన రైలు. అన్నట్లు - నీ పేరేమిటి?'

'మామూలు పేరయితే శంకరం. కానీ ఇక్కడ 'బాయ్' అని పిలిస్తే చాలు'

'నువ్వు బాయ్‌వేమిటి? నీకు నలభయ్యేళ్లు లేవూ?' ఆశ్చర్యంగా చూశాడు రంగధామ్.

'నలభయ్యొకటి. అయినా నేను బాయ్‌నే. ఉద్యోగ నామమది. దానికి వయసుతో నిమిత్తముండదు. చేసే పనిని బట్టి పేరు' విరక్తిగా... భారంగా నవ్వాడు శంకరం.

'చూడూ...' సంచీలోంచి పూలదండని తీసి అది నలిగిపోకుండా అతి జాగ్రత్తగానూ సున్నితంగానూ టీపాయ్ మీద పెడుతున్న ఆ వృద్ధుణ్ని ఆశ్చర్యంగా చూశాడు. సంచీలోంచి బయటపడిన సంపెంగ దండ ఒక్కసారి సువాసనలను వ్యాపింపజేసింది. గది నిండా సంపెంగ పరిమళం అలుముకుంది.

'నా పేరు రంగధామ్. గడియో క్షణమో నా కోసం ఒకామె వస్తుంది. ఆమెను జాగ్రత్తగా నా గదికి తీసుకురావాలి' అర్థిస్తున్నట్లే అన్నాడాయన. ఆ మాటలకి శంకరం ఆశ్చర్యపోయాడు.

తన అంచనా రెండేళ్లటూ యిటూ అయినా ఆయనకి అరవై రెండేళ్లుండి తీరుతాయి. ఆయన శరీరం మీద కూడా వృద్ధాప్యం కొట్టొచ్చినట్టు కనపడుతూంది. ఈ వయసులో... ఆయన కోసం స్త్రీ! హోటల్ రూమ్‌కి రప్పించుకోబడుతున్న స్త్రీ. సిల్కు లాల్చీ, గ్లాస్కో పంచెలలో - ఆయనని చూస్తూ - 'ముసలి మన్మధుడు' అనుకోకుండా ఉండలేక పోయాడు శంకరం.

ఆమె రాక కోసం కాబోలు - వృద్ధుడి మొహంలో ఎంత ఆత్రుత.శంకరాని కాయన మీద గౌరవం పూర్తిగా నశించి - అసహ్యమే కలిగింది. ఈ వయసులో కూడా స్త్రీ కోసం ఎంత వెంపర్లాట.

అయినా ఈ ముసలాడి కోసం వొచ్చే వగలాడి ఎవరో? ఆమెకయినా బుద్ధుండొద్దూ? ఎందుకుంటుంది? వేశ్యకి కావలసింది డబ్బే తప్ప విటుడి వయసు కాదు కదా?

'అలాగే' అన్నాడు మనసులో లేని వినయాన్ని - విధిలేక మాటల్లోకి తెచ్చుకుని.

చేయవలసిన పనేమీ కనిపించక కౌంటరు దగ్గరికి వెళ్లాడు. ప్రపంచం మీదా మనుషుల మీదా అతనికి అసహ్యంగా ఉంది.

టేబులు మీది వార్తాపత్రిక తీసుకునే సరికి - దాని కింద బూతు బొమ్మల పుస్తకం. ఏ పాసింజరో రూములో వొదిలేసుంటాడు - అనుకున్నాడు శంకరం. వొంటి మీద నూలుపోగూ... వొంట్లో సిగ్గూ ఏ మాత్రమూ లేకుండా బర్త్‌డే బేబీలా వాళ్లు ప్రదర్శించేస్తున్న ఆ ముద్దుల గుమ్మ బొమ్మ చూసేసరికతనికి చిరాకే వేసింది.

గదిలో ఆరాటంగా ఎదురుచూస్తున్నాడు రంగధామ్.

ఆమె వొస్తుందా రాదా? రాగలదా లేదా? ఇంకా రాదేం? ఇంటి నుంచి బయటపడటానికి అనుకోని అవాంతరమెదురవలేదు కదా? ఆమె రావాలి. వొచ్చి తీరాలి. రాకపోతే తను భరించలేడు.ఆమె రావడమేమిటి, ఇన్నాళ్ళ... ఇన్నేళ్ల వేదనా ఆవేదనా చల్లారేలా ఆమెను గట్టిగా కౌగిలించుకుని... తన హృదయంలో పేరుకుపోయిన ప్రేమనంతటినీ వర్షించేసి... తేలికపడి...

ఎంతకీ రాదేం?

అతను ఆత్రుత పడుతున్న కొద్దీ కాలం మరింత మెల్లగా గడుస్తున్నట్లనిపిస్తూంది.ఈ విచారకరమయిన పరిస్థితి తానే చేతులారా తెచ్చుకున్నాడు.

సరయిన సమయంలో సరయిన నిర్ణయం తీసుకోక తాను తన జీవితాన్నీ నాశనం చేసుకున్నాడు. భార్య జీవితాన్నీ నాశనం చేశాడు. ఆమె ఎంతో ముందు చూపుతో చక్కని సలహా ఇచ్చినా పెడచెవిని పెట్టడం వలన కలిగిన విపరీత పరిస్థితి ఇది. రెండు జీవితాలు బలయిపోయాయి ఒక తప్పుడు నిర్ణయం వలన. అనాలోచితమైన పని వలన.

గత జలసేతు బంధనం వల్ల ప్రయోజనం శూన్యమని తెలిసినా అతనికి గతం గుర్తుకు రావడం మానలేదు. కంటిని మూసుకుందుకయితే రెప్ప ఉంది. కాని - మనసునీ, ఆలోచనలనీ మూసే దొప్పులు లేవు కదా మనిషికి?

★ ★ ★

'చూడు బాబూ...'

పేపర్ లోంచి తల బయటికి తీసి చూశాడు శంకరం.

అతని కొక్కసారి చాలా ఆశ్చర్యమేసింది. అనుమానమూ వేసింది.



పండీ పండని జుత్తు... ముడివేసి... తలంటుకున్నట్లుంది. పసుపు రాసుకుని స్నానం చేసినట్లు పచ్చగానూ పవిత్రంగానూ ప్రకాశిస్తున్న ముఖం. నుదురు - పాత రూపాయి కాసంత కుంకుమ బొట్టు. పవిత్రత.... పవిత్రత... అన్న పదాలకు ఏ శిల్పకారుడయినా చక్కని రూపమివ్వగలిగితే - ఈమెలా ఉంటుందా శిల్పం - అనిపించిందతనికి. ఆ పెద్దరికానికీ, పవిత్రతకీ చేయెత్తి నమస్కరిద్దామన్నంత గౌరవమూ ఉద్వేగమూ కలిగాయతనిలో. ఇలాటి చవకబారు లాడ్జింగ్ హోటలుకి రావలసిన మనిషి ఎంత మాత్రమూ కాదనిపించింది.

'ఏం కావాలమ్మా?' ఎంతో వినయంగా... భక్తిగా అడిగాడు.

ఆవిడ సిగ్గుపడిపోయింది. బెదిరిపోయింది. కంగారు పడిపోయింది. భయపడిపోయింది. చేయరాని నేరం చేస్తున్నట్లు సంకోచిస్తూ... తడబడుతూ... 'రంగధామ్ గారి కోసం' అంది అక్షరం అక్షరం తేల్చేస్తూనూ, తొందరగానూ. అంతే. ఆ మాటతో శంకరంలో ఒక్కసారిగా ఎంతో మార్పు వొచ్చేసింది.

రూపాలు మోసపూరితాలన్నది సత్యమే. ఈమె పయోముఖ విష కుంభమన్నమాట. భర్త చాటు ఇల్లాలు - రహస్యంగా ప్రియుణ్ని కలుసుకుందుకు వొచ్చింది. ఆ రంగధాముడూ - ఈవిడగారూ పూర్వాశ్రమంలో ప్రేమికులు. ఎవరి సంసారంలో వాళ్లు ఇమడవలసి వొచ్చుంటుంది. వారి ప్రేమ పెళ్లి పండక. చింత చచ్చినా పులుపు చావనట్లు, వృద్ధాప్యం మీద పడినా పూర్వపు వలపు చావక - ఆ ప్రియుడు ఈమె కోసం వందల కొద్దీ మైళ్ల నుంచీ వేంచేయగా, ఈ పతివ్రతా తిలకం భర్తకు తెలియకుండా పూర్వాశ్రమ ప్రణయం కోసం విచ్చేసిందన్నమాట!

ఆ వయసులో అతను... ఈ వయసులో ఈమె.

ముసలాడికి దసరా పండగ. ఆహా... ముసలామెకీ ప్రేమ పండుగే. ఛీ! కలికాలం.

'తప్పు కాదూ?' అప్రయత్నంగా అడిగ[illegible]ం. నిజానికి - నోరు జారి.

'తప్పేమిటి?' నివ్వెరపోయిందావిడ.

తేలు కుట్టిన దొంగ. తను నిజం గ్రహించేసినందుకావిడ తెల్లబోతూంది. విజేతలా ఆమె వంక చూస్తూ... 'మీరిలా ఆయన కోసం రావటం... రహస్యంగా...' అన్నాడు. ఇప్పుడతని కావిడ మీద గౌరవం కాని... భయం కాని... భక్తి కాని... ఏమీ మిగలలేదు. ఆమె చేస్తున్న పని ఆమె విలువలన్నిటినీ అంతరింపజేసిందతని అంతరంగంలో.

ఒక్కసారావిడ కళ్లల్లోంచి ధారాపాతంగా నీళ్లురికాయి. 'నేను చేస్తున్నది తప్పు కాదు బాబూ... ధర్మం... విధి... జీవితం...' అంటూనే ఇక నిలబడలేనట్లు అతనికెదురుగా బల్ల మీద కూలబడి - 'మీ అమ్మా నాన్నలిద్దరూ సజీవులేనా?' అని అడిగింది. హఠాత్తుగా ఆమె ఈ ప్రశ్నెందుకేసిందో అర్థంకాక తెల్లబోతూ.

'ఆ...' అన్నాడు.

'వారికెందరు పిల్లలు?'

'ఇద్దరు మగా, ఇద్దరాడా... మొత్తం నలుగురు'

'ఐతే తప్పకుండా వినవలసిందే'

వీళ్ల రంకుకీ తన కుటుంబ సభ్యుల సంఖ్యకీ [illegible]ధమేమిటో అతనికంతు పట్టలేదు.

'నిజానికి వారక్కడ నా కోసం ఎంతో ఆత్రంగా ఎదురు చూస్తూంటే - నేనిక్కడ కథలు చెబుతూ కాలహరణం చేయడం తప్పే. కాని... నేను ప్రపంచాన్ని పట్టించుకునే దాన్ని. మనుషులు బాగుండాలని వెర్రిపడేదాన్ని. కాబట్టి... సిగ్గు విడిచి నీకు మా కథ చెబుతున్నాను. విని - నువ్వే తెలుసుకుందువు గాని మంచీ చెడూ...'

ఆమె మాటలతని కాట్టే ఉత్సాహం కలిగించలేదు.

తప్పు చేసిన ప్రతివాళ్లకీ ఏదో ఒక సమర్థనా, కారణమూ ఉండే ఉంటాయి.

'ఇద్దరు కొడుకులు... మూడేళ్ళ ఎడంలో. దేశ పరిస్థితుల దృష్ట్యా మనుషులని ప్రేమించే వారు మూడో బిడ్డను కనకూడదని గ్రహించుకుని మరి కనడం మానేశాం. వాళ్లనే చక్కగా పెంచాలనుకున్నాం...'

అతనొక్కసారి ఆశ్చర్యపోయాడు. ఈ వృద్ధురాలు యౌవనంలోనే కుటుంబాన్ని పరిమితం చేసుకుందంటే... అది కూడా స్వచ్ఛందంగా అమలు జరిపిందంటే... గొప్ప విషయమే.

'నా పిల్లలని కాదు కాని... ఇద్దరికిద్దరూ ముత్యాలూ రత్నాలూ. చాలా తెలివయిన వారూ, చురుకయిన వారూ. చక్కగా చదువుకునేవారు. వాళ్లవల్ల మాకు సంతోషమే తప్ప సమస్యలే ఉండేవి కావంటే నమ్ము...'

'ఓహో...' అన్నాడింకేమనాలో తోచక.

'అప్పుడు మేము తెలుసుకోలేక పోయాం కాని వాళ్లు మహా మేధావులూ, కాలం కంటే కూడా ముందు పరుగెత్త గలిగేవాళ్లూ...'

మా నాన్నా నా గురించలాగే అనుకునేవాడు. నా చురుకుతనమూ తెలివితేటలూ బెల్ బాయ్‌కి మాత్రమే చాలాయి - నిట్టూర్చాడు శంకరం నిశ్శబ్దంగా.

'కొందరు మగాళ్లలో మాతృప్రేమ ఉంటుంది. అంటే... పిల్లల్ని... తల్లి కంటె తనే ఎక్కువ ప్రేమిస్తారు. ముద్దు చేస్తారు. వాళ్ళ తోటే ఎక్కువ ప్రపంచం పెట్టుకుంటారు. పిల్లలే తమ సర్వస్వమూ అన్నట్లే ఉంటారు. కాన్సర్ రాశి పురుషులలో యిలాటి వాళ్ళెక్కువట. పిల్లలిద్దరికీ తండ్రంటే ఎంత అభిమానమో తండ్రికి వాళ్ళంటే వెయ్యి రెట్లు వెర్రి. కొన్ని సందర్భాల్లో నటనని నిజం నుంచి వేరు చేసి చూసుకోలేం. ముఖ్యంగా పిల్లల విషయంలో'

'... పిల్లలు తండ్రి పట్ల చూపింది నిజమయిన ప్రేమ కాదా? నటనా?'

'నిజం తెలిసేది నిలకడ మీదా కాలగమనపు గీటు రాయి మీదా కదా?' తొందర పడకన్నట్లు చూసి - 'పిల్లలు పెద్ద వాళ్లయ్యారు. ఉద్యోగాలు రాగా ఉద్యోగస్తులూ గృహస్థులూ కూడా అయ్యారు తల్లిదండ్రుల కళ్ల ముందే'

'తల్లిదండ్రులదృష్టవంతులు'

'ఉండు. వాళ్లకయితే ఉద్యోగాలొచ్చాయి కానీ ఆయన ఉద్యోగం పూడింది. అంటే... అదే... పదవీ విరమణ. పెన్షను రాని ఉద్యోగం. పి.ఎఫ్. గ్రాట్యుటీ వగైరాలన్నీ సుమారు నాలుగు లక్షలు... పదవీ విరమణ సభ వేదిక మీదే చేతిలో పెట్టేసి రామ్‌రామ్ చెప్పేశారు. దండలు - ఆఫీసు వారూ వేశారు, కొడుకులూ కోడళ్లూ కూడా వేశారు. తన రెండు కళ్లూ... వారి భార్యలూ కూడా తనకి దండలు వేసేసరికే అమాయకులెంత పొంగిపోయారో!'

ఎక్కడ దొరుకుతుందా... ఆవిడ ప్రియుడి కోసం ఇలా రావడం తప్పని క్లాసు తీసుకుందామా అని ఎదురుచూస్తున్న శంకరం - 'కొడుకులూ కోడళ్లూ రిటైర్‌మెంటప్పుడు దండ వేయడంలో ఆశ్చర్యమూ అనుమానించదగిందీ ఏముంది?' అని ఎదురుప్రశ్న వేశాడు. ఆవిడ అలా ప్రి[illegible] కోసం వొచ్చిందని తెలియడంతోనే అతనికామె మీద ఆగ్రహమూ కసీ వేయడం మొదలుపెట్టాయి. అతని పేరు చెప్పడాని కెంత సిగ్గు పడిపోయిందీ! ఎన్ని మెలికలు తిరిగిపోయిందీ! నంగనాచి.

'ముందుంది ముసళ్ల పండుగ. వీళ్లంతంత దూరాల నుంచీ భార్యా సమేతంగా రెక్కలు కట్టుకుని ఆ సభకి వాలడానికి కారణం ఆ రాత్రి తెలిసింది. విందు భోజనం అనంతరం విషం లాటి విషయాలు బయటపెట్టారిద్దరు కొడుకులూ. మహానగరంలో ఉన్న తాము మహా ఇబ్బంది పడిపోతున్నామనీ... ఫ్లాటు కొనుక్కుందుకు డబ్బు సర్దుబాటు చేయకపోతే తాము బతకలేమనీ ఆ కథలు. రెండు కథలూ ఒకటే. వినే తండ్రి మనసు కరిగిపోయేలా వ్యధాభరిత కథలు చెప్పింది కొడుకులు కాగా... ఆ విచార కథలకు నేపథ్య సంగీతంగా విషాదం అందించిందేమో కోడళ్లు.

చేతులు పట్టినంత డబ్బు. మనసు పట్టనంత మమకారం. వాత్సల్యం వరదలై పారి వివేకాన్ని ముంచేస్తూండగా... మన సర్వస్వాన్నీ కొడుకులిద్దరి చేతుల్లోనూ ధారపోసేదానికి సిద్ధపడిపోతున్నారా అమ్మ మనసు కల అయ్యా. నేను వారిని గదిలోకి పిలిచి-

'ఎంత కన్న కొడుకులే అయినా వాళ్ళు అడ్డాలనాటి బిడ్డలు కారు. గెడ్డాలూ, మీసాలూ, ఉజ్జోగాలూ పెళ్ళాలూ వొచ్చిన వాళ్లు. నగరాల్లో ఉంటున్న వళ్లు. మనకున్నదంతా ఇదే. ఇకపై పైసా సంపాదనుండదు. మన అనంతరం మిగిలేదంతా వాళ్లవే. కాని... మనం పోయేవరకూ బతకాలంటే డబ్బుండాలి. అది మన చేతిలోనూ మన హక్కుగానూ ఉండటమే శ్రేయస్కరం. తొందరపడకండి.' అని మొత్తుకున్నాను.

'కన్న కొడుకుల మీద అపనమ్మకమా! వాళ్లెవరు? నా కొడుకులు. నా కళ్ళు. కన్న కొడుకులనే విశ్వసించలేకపోతే డబ్బుని నమ్మగలమా? నువ్వు మరేమీ చెప్పకు' అని నా మాటని కొట్టి పారేశారు.

ఆడవాళ్ల ఏ మాటలకి మాత్రం బరువూ విలువా ఉంటాయా?

అమాయకత్వం... అతి మంచితనం... కన్నుపోయేంత కాటుకలా హద్దులు మీరిన తండ్రి ప్రేమ. నన్ను తప్ప తనదంటూ ఏమీ మిగుల్చుకోకుండా సర్వమూ కొడుకులిద్దరికీ అక్షరాలా ధారపోసేశారు. మంచెప్పుడూ మెల్లగానూ, చెడు ఎప్పుడూ వేగంగానూ జరుగుతుంది కదా?'

'వాళ్లు పైవాళ్ళేమీ కారుగా? మీ అబ్బాయిలేగా?'

అతని మాట వినిపించుకోలేదావిడ. 'పంపకాని కింకా ఉన్నాయని నేను ఊహించనే లేకపోయాను. మాకుండినవన్నీ చరాస్తులే. అబ్బాయిలిద్దరూ వాళ్ల వూళ్ల రైళ్లకి టిక్కెట్లు కొనుక్కొచ్చి - చావు కబురు చల్లగా చెప్పారు'

'మీకిక్కడేమీ లేదు. మీరూ మాతో వొస్తున్నారు'

'అంతకంటె ఆనందమేముంటుంది మాకు? కొడుకు దగ్గరుండడ మంటే కొండ మీదుండడమే. రామలక్ష్మణులూ! మీ ఇద్దరిలో ఒకరి దగ్గరారు నెలలూ... మరొకడి దగ్గరారు నెలలూ. మాకు మీ ఇద్దరూ సమానమే. మీరిద్ధరూ మా రెండు కళ్ళూ' అన్నారాయన.

'నగరాలూ వాటిలో యిళ్లూ మీకు తెలియనిదేముంది నాన్నా? మహానగరంలో అద్దె ఇల్లంటే అగ్గిపెట్టెకు పర్యాయ పదమే కదా? ఆ ఇరుకు కూపంలో ఒక అదనపు మనిషికే స్థానముండదు. పైగా ఇద్దరు కూడానా?'

'మరి?' నిర్ఘాంతపోయాను నేను.

'ఒకరి దగ్గరొకరూ... మరొకరి దగ్గర మరొకరూ... నాతో మీరొస్తున్నారు'

'అమ్మా?' అడిగారాయన మొదలు నరికిన చెట్టులా కూలబడి.

'తమ్ముడితో'

'అలా వొద్దు. మమ్మల్ని విడదియ్యకండి. వయసులో... మీకు పుణ్యముంటుంది. నేను లేకుండా ఆయన బతకలేరు, ఆయన లేకుండా నేను బతకలేను... ఆస్తితోపాటు - అప్పుల్లా మమ్మల్నీ పంచుకోండి. వొద్దనడానికి మాకు హక్కు లేదు. కాని... మానవతా దృష్టితో ఆలోచించండి. మమ్మల్ని విడదియ్యటం మీకు న్యాయమూ కాదు, ధర్మమూ కాదు. సబబూ కాదు, సవ్యమూ కాదు' సిగ్గు విడిచి మరీ మొత్తుకున్నాను.

'ఇప్పటికి మరో విధంగా కుదరదు' కట్టె విరచి పొయ్యిలో పెట్టినట్లే అనేశాడు.

మేమిద్దరమూ ఏడుపు ముఖాలతోనే రైళ్లెక్కాం. కొడుకుల వెంట బలిపశువుల్లా.

వారు కలకత్తా...తూర్పు, నేను బొంబాయి - పడమర. కొడుకుల నిర్వాకంతో - ముప్ఫయ్యేళ్ల పైచిలుకు దాంపత్యం నిలువునా - తూర్పు పడమరలుగా ముక్కలయింది.

రుణాల నిలా అమ్మానాన్నలని పంచుకోడం ఈ రోజుల్లో మరీ కొత్తా వింతా ఏమీ కాదు కాని ఇద్దర్నీ కలిపి ఆరేసి నెలల కొకరు భరించడం కాక - ఇలా ఒక్కొక్కరినీ పన్నెండు మాసాలు పంచుకోవడంలో మా సుపుత్రులదే ముందడుగనుకుంటాను...' ఆమెకి దుఃఖం ఆగలేదు.

నిజంగానే ఆ కొడుకులదీ, అలాటి పంపకమూ - అన్యాయమే కాదు, అమానుషం కూడా - అనిపించింది శత్రుస్థానంలో ఉన్న శంకరానికి సహితం.

'ఇది చాలా అన్యాయం. కొడుకులకి మరే హక్కులయినా ఉండొచ్చునేమో కాని తల్లిదండ్రులని బతికుండగానే శాశ్వతంగా విడదీయడం అతి దారుణం. మహాపాపం' జాలిపడకుండా ఉండలేక పోయాడతను. ఐతే అంతలోనే - ఓహో! భర్త కెలాగూ దూరమయిందని - పాత ప్రియుడి కోసం వచ్చింది కాబోలనుకున్నాడు. అలాగయినా రే ఆమె ఇలా రావడం క్షమార్హం కాదెంత మాత్రమూ. ప్రేమలకి గరిష్ఠ వయో పరిమితైనా లేకపోతే అసహ్యంగా ఉంటుంది.'

'ఆ మాట మీదుండు బాబూ... అది కోరడానికే నీకు నా సిగ్గుమాలిన కథ చెప్పాను. సిరబ్బకపోయినా చీడబ్బుతుందని సమాజంలో దుష్ట సంప్రదాయాలు చాలా వేగంగా వ్యాపిస్తాయి. మీ అమ్మానాన్నలని విడదియ్యకేం? సంవత్సరాల తరబడి సంసారం చేశాక బతికుండీ ఒకరికొకరు దూరం కావడం - ఆ వయసులో - ఎంత నరకమో! నువ్వు మీ అమ్మా నాన్నల కలాటి నరకం సృష్టించకేం? ఇదే బాబూ నిన్ను నేను కోరేది. ఇందుకే నాయనా నీకు మా కథ చెప్పింది. వారు నా కోసం ఎదురు చూస్తూంటారు. త్వరగా నన్ను తీసికెళ్లు' బతిమాలుతున్నట్లే అందామె.

'వారంటే? రంగధామ్ గారు మీకు... ఏమౌతారు?'

'రామాయణమంతా విని రాముడికి సీతేమయిందని అడిగినట్లు అదేం ప్రశ్న బాబూ? సీతకి రాముడేమౌతాడో నాకూ వారూ అదే ఔతారు. అనుకోని అదృష్టం కలిసొచ్చి వారి అడ్రస్ దొరికింది. రమ్మని ఉత్తరం రాశాను.' అతను తెల్లబోయాడు. సందేహాలన్నీ తీరడంతో అతను తొందరపడి అన్యాయంగా ఆలోచించినందుకూ అపార్థం చేసుకున్నందుకూ సిగ్గూ పశ్చాత్తాపమూ పడుతూ ఆవిడని రంగధామ్‌గారి రూముకి తీసుకొచ్చి వదిలాడు.

తలుపు చప్పుడవడమేమిటి, ఆరాటంగా ఎదురొచ్చాడాయన. భార్యని కౌగిలించుకున్నాడు. 'పార్వతీ!' అంటూ. ఇద్దరికిద్దరూ ఉద్వేగ పూరితమయిన కౌగిలిలో కరిగిపోసాగారు. మాటలకు నోరు పెగలడంలేదు. కళ్ల వెంట ఇద్దరికీ ధారలుగా కారుతున్న కన్నీరు. గొంతు మూగపోయినా - వారి మనసులు మాత్రం ఊసులు చెప్పుకుంటూనే ఉన్నాయి. ఎంతసేపటికో కొంత తేరుకున్నారిద్దరూ.

'మీరు... సుఖంగా పెద్దాడి దగ్గర?'


చల్లగాలి తగిలేసరికి నీటి మేఘం వర్షించినట్లు ఆయన ఒక్కసారి తన బాధ వొలకబోసేశాడు.

'చెప్పుకుంటే సిగ్గు. కన్నకొడుకు దగ్గర కట్టు బానిసగా... కోడలి కంటికి వ్యర్థ జీవిగా... జీవచ్ఛవంలాగే బతుకుతున్నాను నువ్వు కూడా లేక. కర్రలేని వాడిని గొర్రె కరుస్తుందో లేదో కాని సంపాదన లేని తండ్రిని కొడుకు కూడా లెక్కచెయ్యడు.పుత్ర వ్యామోహంలో ముందుచూపు లేకుండా అవివేకంగా ఆస్తినంతటినీ కొడుకులకి పంచేసినందుకు ఎంత దైన్యమనుభవిస్తున్నానో. నన్ను నేనే నిర్ధనుణ్ణి చేసుకుని - నా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనీ, సుఖాలనీ, జీవితాన్నీ, భార్యనీ కూడా కోల్పోయాను.' కొడుకుల మీద గుడ్డి నమ్మకంతో'

(మిగతా 29వ పేజీలో)

# పదచదరంగం-5

కూర్పు:
ఎన్.పార్థసారథి




## ఆధారాలు

### అడ్డం

1.కంస పాలిత పట్టణము
6.ఈశ్వరుని వాహనము
7.చివర రాజుతోనున్న జంబూ ఫలము
8.పెసరట్టులో బహిర్గతం
11.మహాభారత అనువాద రచన ఈ నదీ తీరాన జరిగినది
12.దొరగారి స్త్రీ లింగము
14.తిరగబడ్డ వృశ్చికము
15.పంటచేను
16.ఇది కడిగిన ముత్యము శుభ్రంగా ఉంటుంది
19.పిడుగు. ఇందులో శని ఉన్నాడు. పాము కూడా ఉంది.

### నిలువు

2.ప్రవాహము
3.అర్ధరాత్రి
4.నక్షత్రము
5.వెట్టిచాకిరీ చేసే సేవకులు
6.రేపల్లె కృష్ణుడు
9.పెద్ద కథని చివర సాగదీస్తే ఆడది అవుతుంది
10.అమ్మోరు లాంటి కుక్క
13.మెరుపు
17.తిరగబడ్డ శత్రువు
18.బ్రహ్మదేవుడు. వికారం తొలగిన బ్రహ్మదేవుడే

**పదచదరంగం-4 సమాధానాలు:**

అడ్డం
1.శ్రీధరం
3.పరివేషము
6.తిష్ట
7.కాకాకా
8.పంట
11.రుచికరం
12.పసిపాప
15.తోలు
16.రాయంచ
17.స్మృతి
20.నరక లోకం
21.మరాళం

నిలువు
1.శ్రీమతి గారు
2.రంకె
3.పతకాలు
4.పేగు
5.ముప్పేట
9.మకరి
10.మిసిమి
13.పదాతి దళం
14.స్వయంపాకం
15.రోదన
18.కోక
19.సామ

(9వ పేజీ తరువాయి)

ఆయన బాధగా చెబుతూంటే - ఆవిడకు కన్నీళ్లొచ్చాయి. ఔను. దెబ్బ ఎక్కడ తగిలినా నీళ్లు కార్చేది కళ్లే కదా. కాఫీ తెమ్మని బాయ్‌కి చెప్పి - వొచ్చి ఆమె పక్కన కూర్చుని అన్నాడాయన. 'నన్ను క్షమిస్తావా పార్వతీ? నేనొక పెద్ద తప్పు చేశాను.'

'ఏమిటి?'

'నీ ఉత్తరం అందింది. ఆ సాయంత్రమే రోడ్డు మీద వెళ్తొంటే ఒకాయన నిలబెట్టి కరపత్రం అందించి నేను చదివేదాకా నిలబడిపోయాడు'

'ఏముందా కరపత్రంలో?'

'ఒక స్వచ్ఛంద సంస్థ వృద్ధాశ్రమం నిర్వహిస్తోంది. మనం చేరడాని కవకాశముంది. కాని - వారి షరతుల ప్రకారం - ఆ ఆశ్రమంలో పిల్లలూ బంధువులూ లేని వృద్ధులకే ప్రవేశం. భార్య ఉండి నేను విధురుడిగా, భర్త ఉండి నువ్వు విధవలా... అక్కడ నువ్వూ ఇక్కడ నేనూ ఒంటరిగా బతకలేక బతుకుతున్నాం. అంతకంటె ఆ ఆశ్రమంలో ఇద్దరమూ చేరి - కలిసి వుండడమే మేలని... మనకి పిల్లలు లేరని సంతకం చేసేశాను. దరఖాస్తు ఫారం అలాగే నింపి'

'అంతేనా?' ఆమె కన్నీళ్లు తుడుచుకుంటూ అంది. ఆవిడకాయన మీద పట్టలేనంత జాలి వేసింది. పిల్లలంటే ప్రాణమూ ధనమూ అన్నీ పెట్టిన ఆయన పిల్లలు లేరని... తనంతట తానే ప్రకటించారంటే... కొడుకులు ఆయనకెంత పున్నామ నరకం చూపించారో భూమి మీద!

'ఐతే... ఇక్కడి నుంచి ఇలాగే... నాతో... ఆ వృద్ధాశ్రమానికి వచ్చేస్తావా?' ఆత్రంగా అడిగారాయన.

'రాక? నేను ముందు మీ భార్యని. తరవాతే అబ్బాయిల కమ్మని. ప్రపంచంలో మీకంటె ముఖ్యులూ కావలసిన వారూ ఎవరూ లేరు నాకు' అని ఆయన చెయ్యి పట్టుకుంది.

'ఐతే మరి మనం ఇక్కడి నుంచే తిన్నగా వృద్ధాశ్రమానికి వెళ్ళిపోదామా?'

'అలా దొంగల్లా వెళ్ళడం దేనికీ? రేపు అబ్బాయీ కోడలూ ఊరి నుంచి వస్తారు. వాళ్లకి చెప్పే వెళ్దాం. మనని కాదనడానికెవరికి మాత్రం హక్కుంది? మనం -భార్యాభర్తలం - ముసలి కాంలో అయినా సరే. చనిపోయే వరకూ మనం భార్యాభర్తలం -' ఆమె కంఠంలో శక్తి.

ఆయన ఆవిడని దగ్గరగా తీసుకుని 'ఔను' అన్నాడు నూతనోత్సాహంతోనూ జవజీవాలతోనూ. ★